**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

| | |
|---|---|
| కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు | - 99854 09260 |
| కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు | - 9985411379 |
| ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు | - 9985171793 |
| నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె | - 9985411377 |


# క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం



యాక్సిలరేటర్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

- రూ.28 కోట్లతో లీనియర్ యాక్సిలరేటర్ యంత్రం ప్రారంభం
- ఐపీడీ బ్లాక్‌కు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేస్తాం
- వచ్చే ఏడాది పీపీపీ కింద ఆదోని మెడికల్ కాలేజీ
- ఒక డాక్టర్ తయారు కావడానికి ప్రభుత్వానికి రూ.1.75 కోట్లు ఖర్చు
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్ చికిత్సలు అందుబాటులోకి తెచ్చామని వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటుచేసిన రూ.25 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలరేటర్ యంత్రం, సిటీ సిములేటర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ అంకాలజీ వార్డులను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న రోగులు తిమ్మప్ప, రాజేశ్వరి, సుప్రియ, చిన్నప్ప, రాజుతో వైద్యం తీరుతెన్నులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సత్యకుమార్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్‌లో లేని విధంగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రూ.28 కోట్లతో విలువైన అత్యాధునిక లీనియర్ ఆక్సిలేటర్ రూ.2.50 కోట్ల విలువైన రోగ నిర్ధారణ పరికరాలను ప్రారంభించామన్నారు. కార్పొరేట్‌లో 10 నుంచి 20 లక్షల దాకా చేసే ఆపరేషన్లు ఇక్కడ ఉచితంగా చేస్తున్నారన్నారు. 14 సంవత్సరాల బాలికకు అత్యాధునిక బ్రెయిన్ సర్జరీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగంలో 40శాతం డాక్టర్ల కొరత ఉందని తెలిసిందని, ఇటీవలే రీడిప్లాయిమెంటు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం జీరో వెకెన్సీ పాలసీ అని ప్రగల్భాలు పలికిందని, సిబ్బంది నియామకంలో చాలా కొరత ఉందన్నారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ఏపీ నుంచే కాకుండా పక్కనున్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి రోగులు వస్తారన్నారు. త్వరలో ఐపీడీ బ్లాక్‌కు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేస్తామని క్రిటికల్ కేర్ యూనిట్ పనులను వేగవంతం చేసి సేవలను అందిస్తామ న్నారు. అనంతరం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మంత్రులు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యతో కలిసి స్వచ్ఛాంధ్ర కింద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ శ్రీనివాసరావు, అకడమిక్ డీఎంఈ డా.జి.రఘునందన్, కర్నూలు జీజీ హెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినర సమ్మ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.కేఎస్ కృష్ణ ప్రకాష్, హెచ్‌డీఎస్ సభ్యులు సాయిప్రదీప్, రామాంజనేయులు పాల్గొన్నారు.

## సర్వజన వైద్యశాల సేవలు భేష్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు నర్సింగ్, ఇతర సిబ్బంది సేవలు బేషుగ్గా ఉన్నాయని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ గ్యాలరీలో వివిధ హెచ్‌వోడీలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఒక్క డాక్టర్‌ను తయారుచేయడానికి రూ.1.75 కోట్లను ప్రభుత్వం ఖర్చుపెడు తుందన్నారు. ఆదోనిలో మెడికల్ కాలేజీనీ పీపీపీ కింద వచ్చే ఏడాది ప్రారంభిస్తామన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీని రాష్ట్రంలోనే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సుగా తయారు చేస్తామన్నారు.




మాట్లాడుతున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు


## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో

# రైతుబిడ్డకు 131వ ర్యాంక్



ప్రణయ్‌రెడ్డి

బండిఆత్మకూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో జాతీయ స్థాయిలో రైతు బిడ్డ 131వ ర్యాంక్ సాధించాడు. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలోని పరమటూరు గ్రామానికి చెందిన పబ్బతి సుధాకర్‌రెడ్డి, రాధమ్మల కుమారుడు ప్రణయ్‌రెడ్డి విజయవాడలోని చైతన్య కళాశాలలో ఎంపీసీ చదివాడు. జేఈఈ మెయిన్ పరీక్షలు రాశాడు. శుక్రవారం అర్ధరాత్రి వెలువడిన ఫలితాల్లో ప్రణయ్‌రెడ్డి 99.994 శాతం మార్కులతో జాతీయ స్థాయి 131వ ర్యాంక్ సాధించాడు. గ్రామంలో పలువురు రైతులు, నాయకులు, చిన్ననాటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బంధువులు ప్రణయ్‌ను అభినందించారు.



# ఎండు మిర్చి ధర భారీగా పతనం

- క్వింటం గరిష్ఠంగా రూ.7,302 పలికిన వైనం
- రూ.6 వేలకు పైగా తగ్గడంతో రైతుల ఆవేదన



ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎండు మిర్చి ధరలు భారీగా పతనమయ్యాయి. శనివారం ఎండుమిర్చి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7302 పలికింది. గత 15 రోజులతో ధరలు పోల్చితే క్వింటానికి గరిష్ఠంగా రూ.6వేలకు పైగా ధర పతనమైంది. ఎండుమిర్చి రైతులు ధరలు పతనం కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన విత్తన, ఎరువులు, పిచ్చికారీ మందుల ధరలు, సేద్యం ఖర్చులు, కోత ఖర్చులు ఇలా ఎకరాకు రూ.1.50 లక్షలు పైగా అవుతుందని రైతులు వాపోయారు. వచ్చిన అరకర దిగుబడి సైతం ధర లేక పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని, ఈ ఏడాది అప్పులు మిగిల్చాయని కన్నీరు పెట్టుకుంటున్నారు. కనీసం ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 1,360 బస్తాల ఎండుమిర్చి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటం రూ.2 వేలు, మధ్యస్థ ధర, రూ.6201 పలికింది.








**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే విజనరీ నాయకుడు. 48 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయన సొంతం. ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పని చేశారు. ప్రస్తుతం నాలుగవ పర్యాయం ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న చంద్రబాబుకు ఉమ్మడి కర్నూలు జిల్లాతో విడదీయలేని రాజకీయ అనుబంధం ఉంది. కర్నూలును పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పం దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినం. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రగతి పథంలో, జిల్లా రాజకీయాలతో ఆయన అనుబంధంపై ప్రత్యేక కథనం.**

# ఉమ్మడి జిల్లా ప్రగతిలో చంద్రబాబు



- కేఈ, బీవీ, ఫరూక్ కుటుంబాలతో బాబుకు విడదీయని బంధం
- సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత
- ఉమ్మడి జిల్లాను పారిశ్రామిక కారిడార్‌గా మార్చాలనే సంకల్పం
- నేడు సీఎం చంద్రబాబు 75వ జన్మదినం

**కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమం, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి కుటుంబాలతో సీఎం చంద్రబాబుకు విడదీయరాని అనుబంధం ఉంది. టీడీపీ ఆవిర్భావం తరువాత 1985లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మంత్రివర్గంలో చంద్రబాబుతో కలసి జిల్లాకు చెందిన బీవీ మోహన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ పనిచేసిన సమయంలో వారి మధ్య రాజకీయ అనుబంధం పెనవేసుకుంది. 1995లో బాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన మంత్రివర్గంలో ఎన్ఎండీ ఫరూక్, దివంగత మంత్రి బీవీ మోహన్‌రెడ్డి పనిచేశారు. 1989లో ఎన్టీఆర్‌తో రాజకీయ విభేదాలతో టీడీపీ వీడిన మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి 1998లో చంద్రబాబు ఆహ్వానం మేరకు టీడీపీలో చేరారు. ఆనాటి నుంచి టీడీపీలోనే కొనసాగుతూ వచ్చారు. ఈ మూడు కుటుంబాలతో చంద్రబాబుకు రాజకీయంగా సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆ అనుబంధంతోనే 2024 ఎన్నికల్లో కేఈ కుమారుడు కేఈ శ్యాంబాబుకు పత్తికొండ టికెట్‌ఇచ్చారు. దివంగత బీవీ మోహన్‌రెడ్డి కుమారుడు బీవీ జయనాగేశ్వరరెడ్డికు ఎమ్మిగనూరు నుంచి వరుసగా మూడు పర్యాయాలు టికెట్‌ఇస్తే.. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. జిల్లాలో రాజకీయంగా బద్ధశత్రువులైన కేఈ, కోట్ల కుటుంబాలను రాజీచేసి ఒకే వేదికపైకి తీసుకురావడంతో చంద్రబాబు సక్సెస్ అయ్యారు. కేఈ కృష్ణమూర్తి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి రెండు కుటుంబాలు చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలోనే కొనసాగుతున్నాయి. ఈ తరువాత మారిన రాజకీయ పరిణామాల వల్ల జిల్లాలో పలువురు నాయకులు అధినేతకు అత్యంత సన్నిహితులుగా మారారు.



2018 సెప్టెంబర్ 12న గాలేరు నగరి ప్రాజెక్టులో భాగంగా గోరుకల్లు రిజర్వాయర్, అవుకు టన్నెల్‌ను ప్రారంభించిన చంద్రబాబు(ఫైల్)

## ప్రతిపక్షంలో అధినేతకు అండగా..!

అధికారం ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు, ప్రజలు అధినేత చంద్రబాబుకు అండగా నిలిచారు. 1994, 1999 ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో టీడీపీని గెలిపించి అండగా నిలిచారు. 2013లో ప్రతిపక్ష నాయకుడి హోదాలో 208 రోజులు చంద్రబాబు పాదయాత్ర చేశారు. జిల్లాలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తూ.. సుంకేసుల బ్యారేజీ దాటి రాజోలి వద్ద తెలంగాణలో అడుగు పెట్టారు. పాదయాత్రలో జిల్లా ప్రజలు చంద్రబాబు బ్రహ్మరథం పట్టారు. 2014 ఎన్నికల్లో ఘన విజయం అందించారు. 2019లో ఘోరంగా ఓడించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం జగన్ రాజకీయ కక్షలో భాగంగా 2023 సెప్టెంబరు 9న అక్రమ అరెస్టు చేస్తే.. 53 రోజులు వివిధ రూపాల్లో జిల్లా వాసులు ఆందోళనలు చేస్తూ చంద్రబాబుకు మద్దతుగా నిలిచారు. 2024 ఎన్నికల్లో రెండు ఎంపీలు, 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించి మీ వెంటే మేము.. అంటూ బాబు భరోసాగా నిలిచారు.



2015 ఆగస్టు 17న తంగడంచె వద్ద అల్ట్రా మెగా ఫుడ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు

## కర్నూలు ప్రగతిలో కీలక పాత్ర

ప్రగతిలో బాబు ముద్ర స్పష్టంగా కనిపించేలా కృషి చేశారు. 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామికవాడకు గతంలో సీఎంగా ఉన్నప్పుడే చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రూ.2,800 కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. విత్తన రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి తీసుకురావడానికి మెగా సీడ్ హబ్‌కు శ్రీకారం చుట్టారు. కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ హబ్ ఏర్పాటుకు పునాది రాయి వేశారు. అల్ట్రా మెగా సోలార్ పవర్ యూనిట్, 5,230 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుకు చంద్రబాబు బీజం వేశారు.

## 2,612 ఎకరాలు.. రూ.2,786 కోట్లు

సీఎం చంద్రబాబు ఆశయం మేరకు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు. వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

చంద్రబాబు సీఎం అయ్యాక జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చారు. ముచ్చుమర్రి ప్రాజెక్టును పూర్తి చేశారు. అవుకు టన్నెల్‌ను పూర్తిచేసి కడప జిల్లాకు కృష్ణా జలాలు మళ్లించిన ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారు. హంద్రీనీవా విస్తరణ పనులు రూ.1,030 కోట్లతో చేపట్టారు. దాదాపు రూ.10 వేల కోట్లలో వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు సహా గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం జిల్లాలో రూ.690 కోట్లతో హంద్రీనీవా కెనాల్ విస్తరణ పనులు జిల్లాలో చేపట్టారు.

## జిల్లాకు చంద్రబాబు తీసుకొచ్చిన ప్రాజెక్టులు కొన్ని

- విమానాశ్రయం కోసం 2017 జూన్ 21న ఓర్వకల్లు సమీపంలో 1,010 ఎకరాల్లో రూ.88.50 కోట్లతో పునాది రాయి వేశారు. కేవలం 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి 2018 జనవరి 9న జాతికి అంకితం చేశారు.
- ప్రపంచంలోనే తొలి వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన అల్ట్రా మెగా సోలార్ పవర్ యూనిట్‌ను ఓర్వకల్లు మండలం గని కేంద్రంగా ఏర్పాటు చేశారు. అదే మండలం గుమ్మటంతాండ, పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య ప్రపంచంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు (పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు)కు 2018లో బీజం వేశారు. 5,230 మెగావాట్ల సోలార్, విండ్, జల విద్యుత్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు.
- జూపాడుబంగ్లా మండలం తంగడంచకు చెందిన ఏపీ విత్తనోత్పత్తి కేంద్రానికి చెందిన 1,600 ఎకరాల్లో మెగా సీడ్ పార్క్‌కు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అక్కడే 2015 ఆగస్టు 17న అల్ట్రా మెగా ఫుడ్ పార్కుకు శంకుస్థాపన చేశారు.
- ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేశారు. 2018 మే 11న ఓర్వకల్లుకు సమీపంలో జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు.
- కొలిమిగుండ్ల సమీపంలో సిమెంట్ పరిశ్రమకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. అలాగే.. ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద 2,781 ఎకరాల్లో రూ.570 కోట్లతో డీఆర్‌డీవో నిర్మాణం చేపట్టారు.
- ఓర్వకల్లు మండలం పాలకొనను, చింతలపల్లి, కొమ్మరోలు గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో 'డ్రోన్ తయారీ పరిశ్రమ' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.



2017 సెప్టంబరు 17న ముచ్చుమర్రి ప్రాజెక్టును ప్రారంభించి జలహారతి ఇస్తున్న చంద్రబాబు (ఫైల్)

# ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**బనగానపల్లె, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):** ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ద న్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లెలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర'లో మంత్రిపాల్గొని ఈ-వేస్ట్‌ను సేకరించారు. స్థానిక పంచాయతీ కార్యాల యంలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్'లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలతో, వివిధ శాఖల అధికారులచే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. స్థానికంగా పాడైపోయిన మొబైల్‌ఫోన్లు, టీవీలు, వైర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల ఈవేస్టును ఆయన తొలగించి మాట్లాడారు. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో ఇప్పటికే 90శాతం ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దామన్నారు. ప్రతి ఒక్కరూ మన ఇంటితో పాటు మన చుట్టూఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. నేటి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ వ్యర్థాల సేకరణ వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయడం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. చెత్తనుంచి సంపద సృష్టించడం ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు అధికారులు, ప్రజలు, యువత అందరూ కలసి స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీవో రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధన్, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, గ్రామ పంచాయితీ ఈవో సతీశ్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, పంచాయితీ కార్యదర్శులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.





**COMPUTER EDUCATION**
NICE COMPUTER SUMMER COURSES: M.S.Office, DTP, TALLY, C++, Phython, Photoshop, DCA, PGDCA etc. Cont: 1st Lane, V.R.Colony, KNL. 9396861308
AJL-236505

**ఇల్లు అమ్మబడును**
కర్నూలు-బాలాజీనగర్‌లో గల ఇ.నెం: 91/4-43-1-2, సుబ్బారావు కాలనీ, శ్రీ హరిణి హోమియోపతి క్లినిక్ ప్రక్కన, SBI బ్యాంకు ఎదురుగా ఉన్న 1st ఫ్లోర్, 2BHK, 2nd ఫ్లోర్, 2BHK, (Size: 30x36) ఉత్తర ముఖం ఇల్లు అమ్మకానికి కలదు.సంప్ర.89191 24437.
AJL-236501

**WANTED**
బాలమద్దిలేటి & సన్స్ హేర్ & బ్యూటీసెలూన్ A/c లో పనిచేయుటకు వర్కర్స్ కాలవెను. సెల్: 98854 46126, 88974 76747. జీతం : 18,000, రూము సౌకర్యం కలదు.
AJL-236373

**వరుణ్ రియల్ ఎస్టేట్**
కర్నూలులో ఇండ్లు, ఫ్లాట్స్ కొనబడును, అమ్మబడును & బ్యాంక్స్ ద్వారా హౌసింగ్ & పర్సనల్ లోన్స్ ఇప్పించబడును.సంప్ర : పి.గోవింద్ సింగ్ రాజ్‌పుత్ : 99630 04641
AJL-229677

**WANTED**
Wanted Teachers To Teach Nursery to 8th Classes Qualifi : Degree, TTC, B.Ed, Sri Anjali Vidyanikethan, Anugonda (V), Kodumur (M). Cell: 83096 08128, 86861 62901.
AJL-610

**ముస్లిం వివాహ సంబంధాలు**
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : 87908 44959. (2వ సంబంధాలు కలవు)
AJL-236375

**FOR ADVERTISEMENTS CONTACT.**
**Cell: 99854 11369**

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA-227149

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి


# ఆ గాత్రం.. గజల్ కోసమే





- మూడు వేలకు పైగా గజల్స్, నాటక ప్రదర్శనలు
- వరించిన రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు
- కందుకూరి పురస్కారంతో పాటు అనేక అవార్డులు సొంతం
- జిల్లా నాటక రంగంలో నాలుగు దశాబ్దాలుగా రాణిస్తున్న మహమ్మద్ మియా

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** ఆయన గాత్రం వింటే ఆ గొంతు గజల్ కోసమే అని ఎవరైనా ఒప్పుకోవాల్సిందే. అంతగా ఆయన పేరులో, చిరునామాలో గజల్ కలగలసిపోయింది. గజల్ మియా అంటే కర్నూల్లో ప్రత్యేకించి మరేమీ చెప్పనవసరం లేదు. అమ్మలోని ప్రేమానుబంధాన్ని తెలియజేస్తూ ఆయన పాడే గజల్స్ వింటే ఆ మాతృత్వ మాధుర్యాన్ని స్వయంగా అందుకున్నట్లు ఉంటుంది.. నాన్నలోని మమతానురాగాన్ని ఆలపిస్తుంటే నాన్నంటే నడిపించే దైవంగా స్ఫురణకు వచ్చేస్తుంది. 'ఆ చల్లని సముద్ర గర్భం.. దాచిన బడబాగ్నులు ఎన్నో.. ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో' అంటూ గళమెత్తిన ఆయన పాటలో దాశరధి గుర్తొస్తారు.. 'పరుల కోసం పాటుపడిని నరుని బతుకు దేనికనీ, మూగ నేలకు నీరందివ్వని వాగు వరుగు దేనికనీ' అంటూ సాగే స్వరాల్లో డాక్టర్ సినారే కనిపిస్తారు. పాట ఏదైనా దానికి తనదైన గాత్రంతో సొబగులు అద్ది వీనుల విందుగా వినిపిస్తారు. మరోవైపు 'పాండవ సుతులను కష్టనష్టాల్ జేసిన కఠిన కౌరవ పాపాత్ములారా మీ అంతు తేల్చద..!' ఘటోత్కజుని వేషంలో విజృంభించినా, 'ఈ కురుక్షేత్ర యుద్ధంతో తాతల్ తండ్రులను చూసి బాణములు వేయ బాధామయమే కదా...' అంటూ పాండవ మధ్యముడు అర్జునుడి వేషం కట్టినా..ఇంకా శ్రీరామ, శ్రీకృష్ణ, దుర్యోధన, కర్ణ, రావణ వంటి అనేక పౌరాణిక పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసినట్లు ఇట్టే ఒదిగిపోయే కళాకారుడు ఆయన. తనదైన కంచు ఎకంఠంతో ఆరున్నర రాగాలనైనా అవలీల గా ఆలపించి నాటక రంగ పిపాసులను మైమరపించే ఆయన అనేక సాంఘిక నాటకాల్లోనూ విలక్షణ పాత్రల్లో మెప్పిస్తున్నారు.

కర్నూలుకు చెందిన మహమ్మద్ మియా గజల్, రంగస్థల కళాకారుడు. ఆయనలోని ప్రతిభా సంపత్తిని గుర్తించిన సినీ పాటల రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు 'గజల్ మియా...నటనలో దూద్ కా సేమియా' అంటూ ప్రశంసల జల్లు కురిపించారు. వృత్తిరీత్యా ఆస్పరి మండలం, ములుగుందం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నంది పురస్కారంతోపాటు అనేకమంది మంది లబ్ధ ప్రతిష్టుల నుంచి అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా నాటక రంగానికి సేవలు అందిస్తున్నారు.

## బాల్యం, కుటుంబ నేపథ్యం, విద్యా జీవితం...

గోనెగండ్ల మండలం, కులుమాల గ్రామంలో పుట్టిన షేక్ మహమ్మద్ మియా తండ్రి ఎస్‌సీ ఖాసీం సాహెబ్ వ్యవసాయ కూలీ. తల్లిదండ్రులు ఇద్దరూ కష్టపడితే గానీ ఇల్లు గడిచేది కాదు. బాల్యంలో తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిపోగా, పక్కనే ఉన్న హనుమాన్ ఆలయానికి వెళ్లేవాడు మియా. అక్కడ భక్తిపాటలు, కీర్తనలు వింటూ ఆ రాగాల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించేవాడు. అలా పద్యాలపై బాల్యంలోనే ఆసక్తి, మమకారం ఏర్పడింది. ఆలయంలో ఉన్న చిన్నయ్య అనే తత్వవేత్త మియాకు ఉన్న శ్రావ్యమైన గొంతును గమనించి చక్కని పద్యాలు పాడటం నేర్పించాడు. అలా బాల్యంలోనే పాటలు పాడుతూ చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే జాతరలు, తిరుణాలలు, దేవాలయాల వార్షికోత్సవాలు, పండుగల సమయాల్లో పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించాడు. ఒక తత్వవేత్త వేసిన పద్యమనే బీజం ఆయనలో పద్య కుసుమాలు పూయించి, జీవితమంతా వాటి పరిమళాలు ఆస్వాదించేలా చేసింది. ప్రాథమిక విద్యాభ్యాసం గోనెగండ్లలో పూర్తిచేశారు.

## కళాశాల విద్య నుంచే రంగస్థల ప్రదర్శనలు...

పదో తరగతి గోనెగండ్లలో పూర్తయ్యాక, ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేశారు. అప్పుడు నాటక ప్రదర్శనలు ప్రారంభించారు. అప్పుడే ప్రఖ్యాత రంగస్థల నటులు డీవీ సుబ్బారావు, వెల్లుర్తి వెంకటనర్సు నాయుడు, వై. గోపాలరావు వంటివారు పద్యాలు పాడే విధానాన్ని గమనించి, వారిలా ప్రయత్నిస్తూ అనేక పౌరాణిక నాటకాల్లో పాత్రలు ధరించారు. 1984లో కర్నూలు ఉస్మానియా కళాశాల్లో బీఎస్సీ పూర్తి చేసి, 1985లో బీఎడ్ పూర్తి చేశారు. అనంతరం ఐదేళ్ల వివిధ రంగస్థల ప్రదర్శనలు ఇచ్చిన మియా 1990లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం రావడంతో జీవితానికి ఒక భరోసా లభించింది. ఉపాధ్యాయునిగా బోధనలు చేస్తూనే అదే ఏడాది ఆనాటి జిల్లా కలెక్టర్ అప్పారావు జిల్లాలో ప్రవేశ పెట్టిన 'అక్షరాస్యత కార్యక్రమం'లో ప్రోగ్రాం అధికారిగా అనేక చైతన్య గీతాలు రాసి, స్వయంగా పాడుతూ గ్రామీణ ప్రజల్లో అక్షరాస్యతపై అవగాహన పెంచారు. ఇందులో విశేషం ఏమంటే ఏ గాయకుని గొంతు వినాలని తపన పడ్డాడో ఆ గాయకుడు వెల్లుర్తి వెంకటనర్సు నాయుడుతో కలిసి ఒకే వేదికపై పురస్కారం అందుకున్నారు.

## గజల్స్ గానంలో సి. నారాయణ రెడ్డి స్ఫూర్తి..

తెలుగు భాషలో మొట్టమొదట గజల్స్‌ను రాసిన ఆచార్య డాక్టర్ సి. నారాయణ రెడ్డి స్ఫూర్తితో ఆయన రాసిన అనేక గజల్స్‌ను మియా పాటడం మొదలు పెట్టారు. అలా ఆయనకు తెలుగు గజల్స్‌ను శ్రావ్యంగా ఆలపిస్తూ, అందులోని భావాన్ని అర్థవంతంగా తెలియజేస్తూ ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నారు. హిందీ గజల్స్‌ను కూడా కర్ణాటక, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లోని వివిధ విశ్వవిద్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాడి పురస్కారాలు అందుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని కాకతీయ, ఆంధ్రా, ఎస్వీ యూనివర్శిటీల్లోనూ ఆయన తన ప్రదర్శనలతో యువతను ఆకట్టుకున్నారు. ఆయన గజల్స్‌ను చిరంజీవి, నాగబాబు, అల్లు అర్జున్, నాటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, నాటి శాసన మండలి ఛైర్మన్ చక్రపాణి యాదవ్, మాజీ మంత్రులు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, టీజీ వెంకటేశ్ వంటి వారంతా గజల్ మిఒయా గజల్స్ విని అభినందించిన వారే.



## లభించిన పురస్కారాలు ఎన్నో...

2000 సంవత్సరంలో ఉత్తమ గాయకునిగా జిల్లా, రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. 2008లో ఉత్తమ నటునిగా వెండి నంది అవార్డు సాధించారు. 2011లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2012లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2013లో ఒంగోలులో ఎన్టీయార్ జాతీయ పురస్కారం, 2014లో శ్రీశ్రీ పురస్కారం, గరికపాటి పురస్కారం అందుకున్నారు. 2015లో టీటీడీ వారి గరుడ పురస్కారం, 2015లో అత్తమ అక్షరాస్యత గాయకునిగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పురస్కారం పొందారు. 2016లో కందుకూరి రాష్ట్ర పురస్కారం అందుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న మియా

## జన విజ్ఞాన వేదిక ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు...

జన విజ్ఞాన వేదిక (జేవీవీ)లో క్రియాశీల సభ్యుడిగా చేరిన మియా అక్షరాస్యత, మూఢ విశ్వాసాల నిర్మూలన, ఆరోగ్యం, పొదుపు తదిరత అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కళాజాత కార్యక్రమాల ద్వారా పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆయనలోని ప్రతిభను గుర్తించిన నాటి ప్రజారాజ్యం పార్టీ స్థాపకుడు, సినీ నటుడు చిరంజీవి కూడా తమ సభ్యుల అంతరంగిక శిక్షణల్లో ఆయన్ను భాగస్వామిగా చేర్చుకున్నారు.



చింతామణి సాంఘిక నాటకంలో



వెండి నంది పురస్కారం తో మియా

## నంద్యాలకు పీఐయూ కార్యాలయం

• ఫైళ్లు వాహనంలో తరలింపు

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) కర్నూలు డివిజన్ కార్యాలయాన్ని నంద్యాల జిల్లాకు తరలించారు. 2021 సంవత్సరంలో జిల్లాల విభజన జరిగిన నేపథ్యంలో పీఐయూ కార్యాలయాన్ని నంద్యాల జిల్లాకు తరలిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత ప్రభుత్వం ఈవిషయంపై పట్టించుకోకపోవడంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక నంద్యాల జిల్లాకు వెళ్లాలని ఉన్నతాదికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం జడ్పీ ఆవరణ నుంచి అధికారులు, ఉద్యోగులు తమ ఫైల్స్‌ను వాహనంలో తరలించారు. ప్రధానంగా పీఐయూ కార్యాలయంలో మొత్తం 25 మంది అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు-1, డీఈ(ఈఈ పీఏ)-1, డీఏఓ-1, డ్రాయింగ్ బ్రాంచ్‌లో ఏఈలు-4, టెక్నికల్ అసిస్టెంట్-1, బ్లూప్రింట్ ఆపరేటర్-1, సూపరింటేండెంట్-1, సీనియర్ అసిస్టెంట్లు-4, జూనియర్ అసిస్టెంట్లు-4, రికార్డు అసిస్టెంట్లు-3, నాల్గవ తరగతి ఉద్యోగులు-3 ఉన్నారు. వీరంతా ప్రతి రోజు నంద్యాలకు వెళ్లిరావాల్సిన పరిస్థితి నెలకొంది.

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

• జిల్లాలో పరీక్ష రాయనున్న 1,170మంది విద్యార్థులు
• దివ్యాంగులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలి
• కలెక్టర్ రాజకుమారి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** నేషనల్ ఎలిజిబులిటి కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) యూజీ పరీక్ష మే నెల 4వ తేదీ జరగనున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, టెక్కెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, బాలికల కళాశాలల తరగతి గదులను ఆమె పరిశీలించారు. మే 4న జరిగే నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో దాదాపు 1,170మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో డెస్కులు శుభ్రంగా ఉంచడంతో పాటు ఒక్కో విద్యార్థికి ఒక్కో డెస్క్ చేపట్టేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా టాయిలెట్లు ఉండేలా చూడాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు అనువైన పరీక్షా కేంద్రాల ఏర్పాటుతో పాటు వీల్‌చైర్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో విశ్వనాథ్, డీఈవో జనార్దన్‌రెడ్డి, నీట్ అబ్జర్వర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## మల్లన్న సేవలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



న్యాయమూర్తికి చిత్రపటాన్ని అందజేస్తున్న పీఆర్వో

**శ్రీశైలం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను శనివారం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న తెలంగాణ ప్రధాన న్యాయమూర్తి దంపతులకు దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం పీఆర్వో స్వామివార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

## జన్మదిన వారోత్సవాలు అభినందనీయం

• రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కరపత్రాలు విడుదల చేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవాన్ని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజులు నిర్వహిం చడం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో వజ్రోత్సవ కరపత్రాలు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నుంచి వారం రోజుల పాటూ నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందులో అష్టావధానం మొదలు పౌరాణిక, సాంఘిక నాటకాలు, నృత్య ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయడం కళాకారులకు ప్రోత్సాహ కరమని చెప్పారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ ఈ కార్యక్రమానికి చేయూత ఇస్తున్నారన్నారు. వివిధ రంగాలకు చెందిన నిపు ణులతో పాటూ ఇటీవల కందుకూరి పురస్కార గ్రహీతలకు ప్రతిరోజూ సత్కారం ఉంటుందన్నారు. సాహిత్య, సంగీత, నాటక అభిమానులతో పాటు సీఎం అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం సాయంత్రం నుంచీ ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచీ కార్యక్రమాలు మొదలవుతాయని వివరించారు.

## 10వేల గృహాలు నిర్మించేలా ప్రణాళిక: కలెక్టర్

**కొత్తపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లావ్యాప్తంగా మే 31లోపు పది వేల గృహాలు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే హౌసింగ్ అధికారులను ఆదేశించామని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉన్నారు.

**పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి**

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ఆమె కొత్తపల్లి బస్టాండ్ సెంటరు నుంచి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. స్వర్ణాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

# మరణంలోనూ వీడని బంధం..

• రోడ్డుప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం
• గృహప్రవేశానికి వెళ్లి వస్తూ..
• జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల వద్ద ఘటన



కారును తొలగిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో దంపతులు

**బండిఆత్మకూరు, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి):** దాదాపు యాభై ఏళ్ల కలసి జీవనం సాగించిన ఆదంపతులు మరణంలోనూ కలిసే ప్రయాణించిన హృదయ విషాదకర సంఘటన ఇది. శుక్రవారం అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల పరిధిలోని ప్రియదర్శిని హోటల్ సమీపాన 44వ జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం కాకనూరుకి చెందిన దేరెడ్డి పుల్లారెడ్డి, ఆయన భార్య లక్ష్మీపుల్లమ్మ, వీరి కుమారుడు సుబ్బారెడ్డి, బంధువులైన బలపనూరుకు చెందిన మహేశ్వరమ్మ, స్రవంతి, మరో నాలుగేళ్ల చిన్నారితో కలిసి గురువారం ఉదయం స్వంత కారులో హైదరాబాద్‌లోని బంధువుల గృహప్రవేశానికి తరలివెళ్లారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణం అయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ప్రియదర్శిని హోటల్ సమీపాన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పుల్లారెడ్డి(70), లక్ష్మీపుల్లమ్మ(67) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవింగ్ సీట్‌లో ఉన్న కొడుకు సుబ్బారెడ్డికి స్వల్పగాయా లయ్యాయి. మహేశ్వరమ్మ, స్రవంతికి బలమైన గాయాలు కాగా, నాలుగేళ్ల చిన్నారికి సైతం గాయాలైనట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## 23న కిసాన్‌మేళా

**ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన నంద్యాల, బనవాసి కేవీకే ఆధ్వర్యంలో ఈనెల 23న పత్తిలో కిసాన్‌మేళా అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి శనివారం తెలిపారు పత్తిపం టలో అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, అధిక సాంద్రత విధానంలో అనువైన హైబ్రీడ్ రకాల పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

## ఆటో బోల్తా.. ఒకరి మృతి

**నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** ఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందిన ఘటన అల్లూరు గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ కట్టపై చోటుచేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాలు.. శనివారం అల్లూరు నుంచి కేసీ కెనాల్ కట్ట మీదుగా జంగంపాడు వైపు వెళ్తుండగా ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న తలారి అశోక్(31) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతుడు అల్లూరు గ్రామనికి చెందిన తలారి వెంకటేశ్వర్లు, సరస్వతమ్మల కుమారుడిగా గుర్తించారు.

# జలవనరుల శాఖ ఏఈఈల బదిలీ

**కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో జలవనరుల శాఖ జోన్-4లో పనిచేస్తున్న పలువురు ఏఈఈలను బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయినవారు తక్షణమే తమకు కేటాయించిన స్థానాల్లో రిపోర్టు చేసుకోవాలని ఇంజనీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్) ఆదేశించారు.

| ఏఈఈ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| నవజీవన్‌రెడ్డి పోకల | టీబీపీ బోర్డు, హోస్పేట | తెలుగుగంగ సబ్‌డివిజన్-4, వెలుగోడు |
| తిప్పేస్వామి. బి. | టీబీపీ హెచ్‌ఎల్‌సీ, అనంతపురం | శ్రీశైలం డ్యామ్ |
| రమేష్ గాజుల | ఎస్‌ఆర్‌బీసీ క్వాలిటీసెల్-4, కర్నూలు | పీఏబీఆర్-5, అనంతపురం |
| రత్నలక్ష్మి సూర | టీబీపీ సెక్షన్-2, నంద్యాల | జీఎన్‌ఎస్‌ఎస్-2, జమ్మలమడుగు, కడప |
| మోహన్‌రావు బైకాటి | ఎల్‌ఎల్‌సీ, కోడుమూరు | హెచ్‌ఎల్‌సీ సబ్ డివిజన్, అనంతపురం |
| నారాయణ స్వామి.ఎం. | సీఏ సబ్‌డివిజన్, నందికొట్కూరు | సీఈ ప్రాజెక్ట్ ఆఫీస్, కడప |
| కె. లలిత | సీఈ సౌత్, హైదరాబాదు | ఎస్‌ఆర్‌బీసీ సబ్ డివిజన్, బనగానపల్లి |
| స్వప్న సరోడె | ఎస్‌ఆర్‌బీసీ క్యూసీ, సబ్ డివిజన్-2, కోవెలకుంట్ల | పులిచింతల సర్కిల్, విజయవాడ |
| వై. నాగరాజు | ఎంఐ సెక్షన్-1, కర్నూలు | హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ సబ్ డివిజన్, గుంతకల్లు |
| దిబ్బనకల్లు నాగన్న | ఎంఐ సబ్‌డివిజన్, నంద్యాల | అన్నమయ్య డివిజన్, కడప |
| భార్గవి ఉప్పల | టీజీపీ డివిజన్, వెంకటగిరి డివిజన్, తిరుపతి | టీజీపీ సబ్ డివిజన్-2, వెలుగోడు |
| ఎన్. వెంకటేశ్ నాయక్ | ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్, కర్నూలు | ఎస్‌ఆర్‌బీసీ క్యూసీ-3, నందికొట్కూరు |
| వెంకట హేమలత | సీఏ సబ్ డివిజన్, నందికొట్కూరు | హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ సబ్ డివిజన్-16, కర్నూలు |
| కిరణ్‌కుమారి | హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, నందికొట్కూరు | సీఈ ప్రాజెక్టు ఆఫీస్, కర్నూలు |
| వీణామాధురి. బి. | హంద్రీనీవా ఎస్‌ఈ ఆఫీస్, కర్నూలు | ఎస్‌ఆర్‌బీసీ సబ్ డివిజన్-3, పాణ్యం |
| ఎం. శ్రీదేవి | హంద్రీనీవా డివిజన్-5, గుంతకల్ | ఎస్‌ఆర్‌బీసీ-2, ఎస్‌ఈ ఆఫీస్, నంద్యాల |
| ఎస్ నాగరాజ | ఎన్‌టీఆర్ టీజీపీ సబ్ డివిజన్-1, బద్వేల్ | శ్రీశైలం డ్యామ్ |
| ఎస్ శ్రీనాథ్‌రెడ్డి | ఎస్‌ఆర్‌బీసీ క్యూసీ-3, నందికొట్కూరు | ఐబీ సబ్ డివిజన్, గుత్తి |
| కె. సుబ్రహ్మణ్యం రెడ్డి | జీఎన్‌ఎస్‌ఎస్ సబ్ డివిజన్-7, జమ్మలమడుగు | ఎస్‌ఆర్‌బీసీ సబ్ డివిజన్-3, నంద్యాల |
| ఎం. నారాయణ | జీడీపీ, గోనెగండ్ల | ఎన్‌టీఆర్ టీజీపీ సబ్ డివిజన్-2, బద్వేల్ |
| బి. శివశంకరప్ప | ఈసీ సబ్ డివిజన్-4, బత్తలపల్లి | శ్రీశైలం డ్యామ్ |
| ఎస్ గోపాల్ నాయక్ | హెచ్‌ఎల్‌సీ, కనేకల్ | శ్రీశైలం డ్యామ్ |
| పి. భార్గవ రామ్ | ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్, కర్నూలు | శ్రీశైలం డ్యామ్ |
| పి. వీరయ్య | ఎస్‌ఈ ఆఫీస్, కర్నూలు | టీజీపీ సబ్ డివిజన్-2, కడప |
| కె. బాబూ కరిమురి | ఎమ్మార్పీ సబ్ డివి-4, ఎర్రగుంట్ల | ఎస్‌ఆర్‌బీసీ సబ్ డివిజన్-4, కోవెలకుంట్ల |
| జి. శ్రీకాంత్ | ఎస్‌ఆర్‌బీసీ సబ్ డివి-4, పాణ్యం | టీజీపీ సబ్ డివిజన్-2, పోరుమామిళ్ల, కడప |

## ఈ-వ్యర్థాల పునరుత్పత్తితోనే మానవ మనుగడ

• 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో మంత్రి టీజీ భరత్

**కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):** ఈ-వ్యర్థాల పునరుత్పత్తి ద్వారా మానవ మనుగడ సాధ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా ఈ-చెక్ (ఎలక్ట్రిక్ వ్యర్థాలు పునర్వినియోగం) అంశంపై మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు అధ్వర్యంలో ఎస్‌బీఐ కాలనీలోని కౌన్సిల్‌హాలులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు మంత్రి టీజీ.భరత్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య హాజరయ్యారు. ముందుగా ఆవరణలో ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ వ్యర్థాల స్టాల్స్‌ను మంత్రి, జేసీ పరిశీలించారు. అనంతరం ఈ-వేస్ట్ సేకరణ మొబైల్ వాహనాన్ని ప్రారంభించి ఈ-చెక్ గ్రీన్‌ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఇటీవల అమరావతిలో ఓ కంపెనీ ప్రతినిధులతో రాష్ట్రంలో ప్రతి ఉమ్మడి జిల్లాలో ఈ-వేస్టేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. వాటి ద్వారా ఆదాయం సైతం సమకూరేలా సీఎం చంద్రబాబు యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు లక్ష్యాలు ప్రతిబింబించేలా విజన్-2047 ప్రణాళికలు ప్రభుత్వం రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. ఎలక్ట్రిక్ వ్యర్థాలు మానవాళికి, పర్యావరణానికి ముప్పు కలగనీయకుండా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సహకరించాలని, కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు ప్రజల్లో చైతన్యం కలిగించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి నిధులు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిం దని జేసీ నవ్య అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ హితం కోసం ప్రజలందరూ పాటుపడాలని కమిషనర్ రవీంద్రబాబుఅన్నారు. ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పివి.కిశోర్, ఎంఈలు సత్యనారాయణ. శేషసాయి, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, కార్పొరేటర్ కురువ పరమేష్ పాల్గొన్నారు.

## నేడు మెగా డీఎస్సీ నోటిఫికేషన్

**నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫకేషన్ ఆదివారం విడుదల కానుంది. ఉమ్మడి జిల్లాల్లో 2678 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏపీ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 6వ తేదీ నుంచి జులై 6వ తేదీ వరకు సీబీటీ విధానంలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఎస్‌ఏ లాంగ్వేజి 1 - 82, ఎస్‌ఏ హిందీ 114, ఎస్‌ఏ ఇంగ్లీష్ - 81, ఎస్‌ఏ మ్యాథ్స్ - 90, ఎస్‌ఏ పీఎస్ - 66, ఎస్‌ఏ బీఎస్ - 74, ఎస్‌ఏ సోషల్ - 112, ఎస్‌ఏ పీఈ - 209, ఎస్‌జీటీ - 1817 కలిపి మొత్తం 2645 పోస్టులను భర్తీ చేయనుంది. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఉమ్మడి జిల్లాల నుంచి ఇంగ్లీష్ -7, మ్యాథ్స్ - 4, పీఎస్ - 4, సోషల్ 2, ఎస్జీటీ - 10లతో కలిపి మొత్తం 2678 పోస్టుల భర్తీకి సన్నద్ధమైంది. అందులోనే నంద్యాల జిల్లాలో ప్రధానోపాధ్యాయుల పోస్టులు 23, ఎస్‌ఏలు - 403, ఎస్జీటీలు 689తో కలిపి 1115 పోస్టులు భర్తీ చేయనున్నారు.

# క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

• రూ.4.10 లక్షలు, సెల్‌ఫోన్లు స్వాధీనం • పరారీలో ఐదుగురు



బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టును చూపుతున్న డీఎస్పీ

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పట్టణంలో గత కొంతకాలంగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4.10 లక్షలు నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నిందితుల అరెస్టును చూపారు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్ వెళ్లే రహదారిలో ఉన్న భార్గవ లాడ్జి పక్కన ఉన్న బహిరంగ ప్రదేశంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ నేతృత్వంలో కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వారి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కోవెలకుం ట్లకు చెందిన వడ్డె రఫీ అనే వ్యక్తి ఈ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలిందని చెప్పారు. రఫీతో పాటు కోవెలకుంట్లకు ఓబులపు రాజారెడ్డి, సురేశ్‌బాబు, వినోద్‌కుమార్, సునీల్, మద్దిలేటిని అదుపులోకి తీసుకున్నామని, ఐదుగురు పరారీలో ఉన్నారని తెలిపారు.

## స్వర్ణ కవచ సమర్పణ సేవ

**మంత్రాలయం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):** వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ నిర్వహించారు. చైత్ర షష్టి శనివారం శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించారు.

## యువతి ఆత్మహత్య

**కర్నూలు క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎండోన్‌మెంటు కాలనీ పార్కులో నాగలక్ష్మి(27) అనే యువతి ఉరి వేసుకుని మృతి చెందింది. వివరాల మేరకు.. పెద్దకడుబూరు మండలం మేకడోన గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఎంఎస్‌సీ బీఈడీ పూర్తిచేసి, బిర్లాగేటు సమీపంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తుంది. శుక్రవారం రాత్రి హాస్టల్ నుంచి వెళ్లింది. శనివారం పార్కులో ఉరి వేసుకుని కనిపించింది. తల్లి ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

## జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో 'చైతన్య' విజయకేతనం



బుద్ధవంశీకృష్ణ (137), జి.తేజ్ (177), సాయి ప్రసన్న

**కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అనితర సాధ్యమైన ప్రతిభను ప్రదర్శించారని శ్రీచైతన్య కళాశాలల ఏజీఎం మురళీకృష్ణ, డీన్స్ సరళ, బాలాజీ, కళ్యాణ్‌బాబు తెలిపారు. ఆలిండియా స్థాయిలో కేటగిరిలో బి.వంశీకృష్ణ 137వ ర్యాంకు, జి.తేజ 177వ ర్యాంకు, జి.గిరీష్ కుమార్ 1072వ ర్యాంకు కే.వినయ్ కుమార్ 1306, టి.సాయి ప్రనజ 1496వ ర్యాంకు, ఆర్.ఉపేందర్ రెడ్డి 2236వ ర్యాంకు, వెంకట విశాల్ 4310, కే.మోక్షిత్ సాయి 5900, పి.అభిషేక్ నాయక్ 6705, సి.నోవినేశ్ నాథ్ 6726 ర్యాంకులు సాధించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు 198 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. గత ఏడాదికి, ఈ ఏడాదికి ఫలితాలు మెరుగ్గా ఉన్నట్లు ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తీర్చిదిద్దిన అధ్యాపకులను, సహాయ సహకారాలు అందించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

## జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో నారాయణ ప్రతిభ



నారాయణ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న డీజీఎం గోవర్ధన్ రెడ్డి

**కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** జేఈఈ-మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో మరోసారి కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ప్రశంసించింది. మిథిన్ సాయి 99.91 పర్సంటైజ్‌తో 1464 ఆలిండియా స్థాయిలో ఓపెన్ ర్యాంకు, కేటగిరిలో 253వ ర్యాంకు, కే.జీవన్ కుమార్ 99.85 పర్సంటైల్‌తో 2430 ఆలిండియా ఓపెన్ ర్యాంకు, కేటగిరిలో 447వ ర్యాంకు, కే.చరణ్ 00.84 పర్సంటైల్‌తో 2605 ఆలిండియా స్థాయిలో ఓపెన్ ర్యాంకు, కేటగిరిలో 488వ కేటగిరి ర్యాంకు, ఎన్.శివధనుష్ 99.48 పర్సంటైల్‌తో 8180 ఆలిండియా ఓపెన్ ర్యాంకులు సాధించారు. అలాగే ఖాజావుద్దీన్ 8930, కే.సాయిశృతి 8933, సాయిమన్నన్ గౌడు 1130, కే.సాయి భాస్కర్ 12263 ఆలిండియా స్థాయిలో ఓపెన్ ర్యాంకులు సాధించారు. ఆలిండియా ఓపెన్ ర్యాంకులో 5వేలలోపు ముగ్గురు, 10వేలలోపు 6 మంది, 20వేలలోపు 12 మంది, 30వేలలోపు 16 మంది, 40వేలలోపు 23 మంది, 50వేలలోపు 26 మంది, 60లోపు 29 మంది, 80వేలలోపు 33 మంది, లక్షలోపు 38 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథరెడ్డి, వేణు గోపాల్ రెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్స్ విజయమోహన్, సుజాత, సారిక సరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్తికొండవాసికి 206 ర్యాంకు



చెన్నకేశవ

**పత్తికొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** పట్టణానికి చెందిన కప్పట్రాళ్ల చెన్నకేశవ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 206 ర్యాంకు సాధించాడు. తండ్రి రమేశ్ [illegible] పనిచేస్తుండగా, తల్లి కళ్యాణి జేఎం తండాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

## జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో వంగల అజయ్ రెడ్డి ప్రథమం



అజయ్ రెడ్డి (300/300)

**కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** జేఈఈ-మెయిన్స్ విడుదలైన ఫలితాల్లో కర్నూలు చెందిన వంగల అజయ్ రెడ్డి 300/300 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలోనూ, తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రథమ ర్యాంకును సాధించారు. కర్నూలు మాధవీనగర్‌లో వెంకటరమణారెడ్డి, మాధవి దంపతుల సంతానం అజయ్ రెడ్డి. వెంకటరమణారెడ్డి గృహోపకరణాల వ్యాపారస్తుడు. తల్లి మాధవి గృహిణి. అజయ్ రెడ్డి 1 నుంచి 8వ తరగతి వరకు కర్నూలులోనూ, 9, 10 తరగతి వరకు హైదరాబాదు శ్రీచైతన్య పాఠశాలలోనూ చదివారు. హైదరాబాదులోని అక్షర భవన్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో 465 మార్కులు సాధించాడు. జేఈఈ-మెయిన్స్ ఫలితాలో 300/300 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా తండ్రి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడికి జాతీయ స్థాయిలో ర్యాంకు వస్తుందని ముందే ఊహించామని, అయితే 300/300 పర్సంటైల్ సాధిస్తాడని ఊహించలేదన్నారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

## లోపాలను సవరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలో ఉన్న లోపాలను సవరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. నంద్యాల ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏపీ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం డీఎస్సీ సెలక్షన్ లిస్ట్ క్రమం మారకుండా మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ప్రమోషన్ సీనియారిటీ లిస్టులు తయారు చేయాలని కోరారు. అలాగే కోర్టు తీర్పు ప్రకారం అప్‌గ్రేడ్ అయిన పోస్టులకు లాంగ్వేజి పండిట్లకు ప్రమోషన్ ఇచ్చిన తర్వాత అర్హులైన ఎస్జీటీలకు ఎస్ఏ తెలుగు, ఎస్ఏ హిందీ ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పనులు వేగవంతం

పాములపాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం గాలీవాన బీభత్సానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు పడిపోయిన గ్రామాల్లో విద్యుత్ అధికారులు పనులు వేగవంతం చేశారు. శనివారం ఉదయం నుంచే విద్యుత్‌శాఖ ఏడీ రామసుబ్రహ్మణ్యం సిబ్బందితో దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. జూటూరు. రుద్రవరం, తుమ్మలూరు, క్రిష్ణరావుపేట, కోల్స్‌ఆనందాపురం, ఇస్కాల, చెలిమిళ్ల తదతర గ్రామాలలో ఈదురు గాలుల కారణంగా పడిపోయిన దాదాపు 20 స్తంభాల స్థానంలో కొత్తవి వేసి కరెంటు సరఫరా పునరుద్ధరించారు.

## ఆకుతోటల పరిశీలన

పాములపాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులకు దెబ్బతిన్న ఆకుతోటలను ఉద్యానశాఖ అధికారి చందన పరిశీలించారు. శనివారం మండలంలోని ఇస్కాల గ్రామంలో ఆకుతోటలను పరిశీలించారు. మిరప, కూరగాయలు, ఉల్లి తదితర పంటలలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలియచేశారు.

**కొత్తపల్లి:** కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామ శివారులో గాలివానకు నేలవాలిన మామిడికాయలను ఆత్మకూరు ఉద్యానవన శాఖ అధికారి చందన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం గాలివానకు మార్తండరెడ్డి రైతు మామిడి తోట దెబ్బతింది. సుమారు రూ.లక్ష మేర నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

## బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించి పరిస్థితులను అదుపుచేయాలని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నంద్యాల విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు హిందువులపై జరుగుతున్న దాడులకు చరమగీతం పాడాలన్నారు. వక్ఫ్ సవరణను ముస్లిం సమాజంలో వివక్షకు గురవుతున్న అనేక తెగలకు సంబంధించిన ముస్లింలు, మహిళలు స్వాగతిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, బీజేపీ కార్యకర్తలు, హిందూసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీకేజీ అత్యంత ప్రమాదకరం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గృహాల్లో గ్యాస్ లీకేజీ అత్యంత ప్రమాదకరమని రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల జీజీహెచ్‌లో అగ్నిప్రమాదాలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గృహిణులు గ్యాస్ లీకేజీ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గతంలో ఆస్పత్రి భవనాలు చిన్నవిగా ఉండేవని, ప్రస్తుతం బహుళ అంతస్తులుగా మారాయన్నారు. నిర్మాణ సమయంలో విద్యుత్ పరికరాల విషయంలో నాణ్యమైన వాటిని వాడాలని సూచించారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల్లో షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తాయన్నారు. అంతేకాకుండా భవనాల్లో రెండు ద్వారాలు ఉండేలా నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, జిల్లా ఫైర్ ఆఫీసర్ బాలరాజు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ యోగేశ్వరరెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బాలేశ్వరి, జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ పుష్పలత, సెక్యూరిటీ అధికారి కేజేరెడ్డి పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

నందికొట్కూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రద్దు అయ్యే వరకు వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వామపక్ష నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో సిపిఐఎంఎల్ లిబరేషన్, ఎంసీపీఐయూ, సీపీఐఎంఎల్ మాస్ లైన్ న్యూ డెమోక్రసీ, మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో ముస్లిం మత పెద్దలు బుధవారం ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు ఎస్‌బీటీ, సుధాకర్, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ ర్యాంకర్లకు అభినందనలు



ర్యాంకర్లతో కళాశాల యాజమాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యధిక పర్సెంటైల్ సాధించిన రావూస్ కళాశాల విద్యార్థులను కళాశాల ఛైర్మన్ అప్పారావు, డైరక్టర్ మోనిచంద్రలు అభినందించారు. వారు మాట్లాడుతూ పూర్ణేష్ రావ్ 98.0597, సుబ్బసాయిసహస్ర 97.7576, శ్రావ్య 97.7452, ఎస్ సభా 95.5756, తౌఫిక్‌హుస్సేన్ 93.0321 పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. మంచి ఫలితాల సాధనకు కృషిచేసిన అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.




# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

● ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యంగా మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వర్ణాంధ్రను సాధిద్దామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని బిజినవేముల గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చీపురు పట్టుకొని అధికారులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, సీనియర్ టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, సర్పంచ్ రవియాదవ్ అధికారులు పాల్గొన్నారు.

**పాణ్యం:** స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పంచాయతీ సిబ్బంది నిరుపయోగ ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరించారు. గోనవరంలో ఏపీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ట్యూబులైట్లు, సెల్‌ఫోన్‌లు, బల్బులు, ఫ్యాన్‌లు సేకరించి పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ వస్తువులను రీసైక్లింగ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత దగ్గరగా తీసుకువెళ్లడానికి ఈ కార్యక్రమాలతో అవగాహన కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దానం, పంచాయతీ కార్యదర్శి రాజేష్, టీడీపీ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**పాములపాడు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆర్డీవో నాగజ్యోతి అన్నారు. శనివారం పాములపాడులో ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ మండల ప్రత్యేక అధికారి రాజ్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ, పఠాన్‌బాబు, వెలుగు సీసీ ఉమామహేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వెలుగోడు:** ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డిలు అన్నారు. శనివారం వెలుగోడు పట్టణంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. వెలుగోడు పట్టణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు కలసి ర్యాలీ నిర్వహించారు. ప్రదాన రహదారి వెంట దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. చెత్త చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామాలలోని చెత్త బండ్లలోనే వేయాలన్నారు. మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మురారి, ఎపియం సుగుణపాల్, కార్యదర్శి సుంకన్న, స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**నందికొట్కూరు:** 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ-వేస్టేజ్ వస్తువులను సేకరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ బేబి ఆధ్వర్యంలో పనికి రాని ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించి చెత్త బుట్టలో వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** పరిశుభ్రతతోనే ప్రగతి సాధ్యమని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ నినాదంతో ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను తొలగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**జూపాడుబంగ్లా:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛాంధ్ర కోసం పాటుపడాలని ఎంపీడీవో గోపికృష్ణ అన్నారు. శనివారం స్వర్ణఆంధ్ర-స్వచ్ఛంధ్రా అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయ వద్ద చెత్తను ఊడ్చి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ నాగేంద్ర, ఉపతహసీల్దార్ నాగన్న, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఏపీవో రేష్మా తదితరులు పాల్గొన్నారు.

**మహానంది:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో మహమ్మద్ దౌలా తెలిపారు. శనివారం మహానంది మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వచ్ఛహిత సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శ్రమదానం ద్వారా శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రమాదేవి, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ పాల్గొన్నారు.

**బండిఆత్మకూరు:** స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ను ప్రతి ఒక్కరూ బాధ్యతతో చేపట్టాలని తహశీల్దార్ పద్మావతమ్మ, ఎంపీడీవో దస్తగిరి కోరారు. శనివారం బండిఆత్మకూరు, వివిధ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, చెత్త చెదారాలను ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లో తొలగించారు.

**నంద్యాల నూనెపల్లె:** పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డీఆర్వో రామునాయక్ అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో డీఆర్వో రామునాయక్, కలెక్టరేట్ ఏవో రవికుమార్ తదితర సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు.



బిజినవేములలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయసూర్య, అధికారులు



జూపాడుబంగ్లాలో ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది



మహానందిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కలెక్టరేట్ ఆవరణలో శుభ్రం చేస్తున్న డీఆర్వో రామునాయక్



నందికొట్కూరు: అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

# ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని రన్‌ఫర్‌జీసస్ కమిటీ ఛైర్మన్ శీలంశేషు, డీనరీ ఛైర్మన్ త్యాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా పట్టణంలోని ఇందిరానగర్‌లో గల సీఎస్ఐ చర్చీ నుంచి గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్ మీదుగా ఏబీఎం పాలెం చర్చీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా చర్చీలు ఫాదర్లు తదితరులు ఉన్నారు.

**నంద్యాల కల్చరల్:** నంద్యాల పట్టణంలోని అన్ని చర్చిల సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ పేరిట నంద్యాలలో ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు యొక్క పునరుద్ధానమును ప్రజలకు తెలియజేసేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని డీనరరీ ఛైర్మన్ జోసఫ్ బాబు తెలిపారు. రన్‌ఫర్ జీసస్ వినూత్న సువార్త ర్యాలీ హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి నుండి శ్యామకాలువ, మున్సిపల్ కార్యాలయం, సంజీవనగర్ గేట్, శ్రీనివాససెంటర్, పద్మావతీ నగర్, టెక్కె, సాయిబాబానగర్, దేవనగర్ మీదుగా హోలీ క్రాస్ కెథడ్రాల్ చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రన్‌ఫర్ జీసస్ కన్వీనర్ రవీంద్రపాల్, సీయస్ఐ చర్చి సెక్రటరీ ప్రభుదాసు, స్టీపెన్,సురేష్‌పాల్, పట్టణలోని అన్ని చర్చిల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని చర్చిల సంఘాల సభ్యులు

## సంగమేశ్వరం, కొలనుభారతి అభివృద్ధికి చర్యలు

● కలెక్టర్ రాజకుమారి



స్వామికి పూజలు చేస్తున్న కలెక్టర్ దంపతులు

కొత్తపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని కృష్ణాతీరంలోని సప్తనదుల సంగమేశ్వరాన్ని కొలనుభారతి క్షేత్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నంద్యాల కలెక్టర్ రాజకుమారి గనియా తెలిపారు. శనివారం కలెక్టర్ రాజకుమారి దంపతులు సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలను సందర్శించారు. ముందుగా కలెక్టర్ దంపతులకు జిల్లా దేవాదాయశాఖ అధికారి మోహన్, స్థానిక ఈవో రామలింగారెడ్డి, పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ, శ్రీనివాసశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కొలనుభారతి సరస్వతి అమ్మవారిని, సంగమేశ్వరంలోని వేపదారు శివలింగాన్ని కలెక్టర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ దంపతులు సంగమేశ్వర స్వామి ఆలయ చరిత్రను పురోహితులు తెలకపల్లి రఘురామశర్మను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, టీడీపీ నాయకులు నారపురెడ్డి, లింగస్వామి గౌడు, ఎస్ఐ జయశేఖర్ తదితరులు ఉన్నారు.

● కొలనుభారతి, సంగమేశ్వరానికి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌తో చర్చించి త్వరలోనే రెగ్యులర్ దేవాదాయ శాఖ అధికారిని నియమిస్తామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి కొలనుభారతికి రెగ్యులర్ ఈవో లేక ఆలయ అభివృద్ధి కుంటు పడిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనికి ఆమె స్పందిస్తూ రెగ్యులర్ ఈవోతో పాటు ఆలయ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు.

## కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం

నందికొట్కూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు శ్రీహరి సర్వోత్తమ రెడ్డి, చిట్టిబాబు, తదితరులు సమావేశం నిర్వహించారు. వారు కళాశాలలో నెలకొన్న సమస్యలను చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాల గురించి చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి రోజు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, కళాశాలలోని విద్యార్థులు మైదానంలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించి, కబ్బడీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలను ఆడించాలని ప్రతిపాదించారు. అలాగే పట్టణ ప్రజల కోసం రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రామిరెడ్డి, డా. అన్వర్ హుస్సేన్, పరిమళాదేవి, కాజా హుస్సేన్ పాల్గొన్నారు.

## నేడు టీడీపీ కార్యాలయంలో రక్తదానం

ఆత్మకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం రక్తదానం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపు మేరకు సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి టీడీపీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆలయాలు, చర్చీలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరపాలని అన్నారు.

## సమాజ వెలుగు దీపికలు మహిళలు

నందికొట్కూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజ వెలుగు దీపికలు మహిళలు అని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణీ మహిళలకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ వెలుగు దీపికలు మహిళలేనని అలాంటి వారి బలమైన ఆహారాన్ని అందించాల్సి బాధ్యత స్త్రీ శిశు సంక్షేమ శాఖపైన ఉందని ఎమ్మెల్యే తెలిపారు. గర్భిణులు ఎంత ఆరోగ్యంగా బలంగా ఉంటారో వారికి పుట్టబోయే సంతానం కూడా అంతే బలంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కోటేశ్వరమ్మ, డిఆర్‌డిఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్ జాకీర్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

బండిఆత్మకూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీలలో చదివిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్‌రహెమాన్ సూచించారు. శనివారం బండిఆత్మకూరు, సంతజూటూరు గ్రామాల్లో చేరికల కార్యక్రమాలు నిర్వహించారు. పాఠవాల చదువులకు ప్రభుత్వ పాఠశాలలనే ఎంచుకుని చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దస్తగిరి, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

గడివేముల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వేలను పకడ్బందిగా నిర్వహించాలని అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అతివేగం ప్రమాదకరం: ఎస్ఐ

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వాహనాలు అతివేగంగా నడిపితే ప్రమాదాలకు గురిఅవుతారని ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తర్తూరు గ్రామం వద్ద ఆటోకార్మికులతో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల్లో అధికలోడు తగ్గించాలని, ప్రతి ఒక్కరూ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. రోడ్డు భద్రత, నిబంధనలు పాటించాలని సూచించారు.

## రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భూములు రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి రైతులందరికీ ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా సర్వే చేపట్టాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలోని మండ్లెం గ్రామంలో రీసర్వేపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండ్లెం పొలిమేరలో 6527 ఎకరాలు విస్తీర్ణం ఉందని, ప్రతిరోజు 20 ఎకరాల మేరకు రీసర్వేచేసి రైతులకు వివరాలు అందజేయాలని తహసీల్దార్ సర్వే టీంలకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ నెల 21న గ్రామంలో రైతుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి రీసర్వే ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ నాగన్న, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే గౌరు చరిత



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత

గడివేముల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వ్యాపారస్థులు జొన్న పంటను తక్కువ ధరకు కొనడంతో రైతులు నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి జొన్న కొనుగోలుకు చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. క్వింటాకు రూ.3,371 సివిల్‌సప్లయ్ సంస్థ ద్వార జొన్న పంటను కొనుగోలు చేస్తారని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాబార్డ్ నిధుల నుంచి గడివేముల, కొర్రపోలూరు రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయని అన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ మట్టికట్టి కృంగిందని వాటి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని, అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేపట్టాలని సీఎంను కోరామని అన్నారు. సబ్సిడీలో మంజూరైన వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే గౌరుచరిత రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, సివిల్ సప్లయ్ డీఎం రాజు, ఆగ్రోస్ డీఎం జయచంద్రారెడ్డి, వ్యవసాయశాఖ అధికారి హేమచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యంరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, మురళీమోహన్‌రెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, ఈశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గిరిబాబు, కృష్ణయాదవ్, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

## కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు నిర్వహించే పని ప్రదేశాలలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ కోరారు. వారు శనివారం మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించి, సమస్యలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండుతుండడంతో తాగునీరు, మజ్జిగ, నీడ, మెడికల్ కిట్లు కల్పించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## వ్యక్తిగత కక్షలు మానుకోవాలి

మహానంది, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివసించే ప్రజలు స్వార్థంతో వ్యక్తిగత కక్షలు మానుకొని శాంతియుత వాతావరణం నెలకొల్పాలని నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మహానంది మండలం గోపవరం గ్రామంలో ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్‌ను పోలీస్ సిబ్బంది నిర్వహించారు. సీఐ మాట్లాడారు. గ్రామంలో అనుమానితుల ఇళ్లతో పాటు షాపులను సోదాలు చేయ డం జరిగిందన్నారు. గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఎవరైన సైబర్ నేరాల బారిన పడితే 1930కి కాల్‌చేసి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బండిఆత్మకూరు, గోస్పాడు ఎస్ఐలు జగన్మోహన్, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

## వైసీపీకి ఆడపడచులంటే గౌరవం లేదు



మాట్లాడుతున్న కాకరవాడ వెంకటస్వామి

నంద్యాల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఆడపడుచులంటే గౌరవం లేదని, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి నేర చరిత్ర గురించి అందరికీ తెలుసు అని టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాకరవాడ వెంకటస్వామి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కబ్జాలు, బియ్యం దందా స్మగ్లింగ్ ప్రొత్సహిస్తున్న మీరు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని విమర్శించే అర్హత లేదన్నారు. జగన్ వైఖరే ఆపార్టీకి సమాధి కడుతుందన్నారు. గంజాయి, గంధం చెక్కల దొంగలైన మీకు బైరెడ్డి శబరిని విమర్శించే హక్కు ఆళ్లగడ్డ వైసీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డికి లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధి నరహరి విశ్వనాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఉప్పరి అజయ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

నంద్యాల క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచనలతో ప్రతి శనివారం జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. విద్యాసంస్థలు, ముఖ్య కూడళ్లలో యువత, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, ప్రజలకు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్మెట్‌లేకుండా వాహనాలు నడపరాదని, సీటు బెల్టు పెట్టుకోవాలని, లైసెన్స్ కలిగి ఉండాలని, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించకూడదని అవగాహన కల్పించారు.

## పర్యావరణ కాలుష్యాన్ని నివారిద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

**డోన్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ కాలుష్యాన్ని నివారణకు ప్రజలు సహకరించాలని ఆర్డీవో కేపీ నరసింహులు తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, డీఈ రఘు, ఏఈ సురేష్, ఎన్జీవో రఫీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర, డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కమలాకర్‌రావు, ఏఈ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ కార్యాలయంలో కార్మికులు, కార్యాలయ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు.

**బేతంచెర్ల:** స్థానిక నగర పంచాయతీని పారిశుధ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయం నుంచి స్వచ్ఛంధ్ర, - స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, మండల విద్యాధికారి సోమశేఖర్, ప్రభుత్వ విద్యాధికారి డాక్టర్ తస్లీమ్, డాక్టర్ ప్రియాంక, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**కోవెలకుంట్ల :** అందరి సహకారంతో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని కోవెలకుంట్ల మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి తెలిపారు. గుళ్లదుర్తి గ్రామంలో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమలో మండల అభివృద్ధి అధికారి వర ప్రసాదరావు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, డోన్ డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి, ఎంఈవో వెంకటసుబ్బయ్య, పశువైద్యాధికారి క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.

**చాగలమర్రి:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఓబలేసు అన్నారు. శనివారం స్వచ్ఛదివాస్ కార్యక్రమంపై మండలస్థాయి అధికారులతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవోలు , సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలి

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** యువత సెల్‌ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలని ఆళ్లగడ్డ టౌన్ సీఐ యుగంధర్ సూచించారు. శనివారం స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తియాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ జయ్యప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి


డీటీకి వినతి పత్రాన్ని ఇస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** కేసీ కెనాల్ ఆయకట్టు పరిరక్షణ కోసం తక్షణమే గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరధరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేసీ కెనాల్ పరిరక్షణ సమితి నియోజకవర్గ కన్వీనర్ జాఫర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యకు ఇచ్చారు. కార్యక్రమంలో గుండ్రేవుల సాధన సమితి నాయకులు రంగేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, పెద్ద లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, సిద్ది సత్యం, పూర్ణయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలి


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**రుద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం రుద్రవరం ఆదర్శపాఠశాలలో డ్రెస్ కోడ్‌లో విద్యార్థులు పరీక్ష రాస్తుండగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రవేశ ఎగ్జామ్ నిర్వహించామన్నారు. 50మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**బేతంచెర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వర రావు అన్నారు. శనివారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముద్దవరం గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తనిఖీ చేశారు. అలాగే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## డ్రైనేజీలు నిర్మించండి

**డోన్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొత్తపల్లె గ్రామంలో సీసంగుంతల వెళ్లే బ్రిడ్జి వద్ద ఉన్న కాలువ పూర్తిగా దెబ్బతిందని, వెంటనే కొత్త కాలువను నిర్మించాలని గ్రామస్థులు కోరారు. శనివారం గ్రామ పంచాయతీ సెక్రటరీ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు హనుమన్న, లక్ష్మీదేవి, మనిసాయి, మరో 10 మంది ఉన్నారు.




# పెనుగాలుల బీభత్సం..

- విరిగిపడ్డ వేప చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి, బొప్పాయి కాయలు
- ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు


ఓజీ తండాలో గృహంపై విరిగిపడ్డ వేప చెట్టు, విద్యుత్ స్తంభం

**చాగలమర్రి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఓజీ తండా, ఎం.తండ, తోడెండ్లపల్లె, చక్రవర్తులపల్లె, ముత్యాలపాడు గ్రామాల సమీపంలో శనివారం తెల్లవారుజామున పెనుగాలుల బీభత్సంతో అపార నష్టం సంభవించింది. ఓజీ తండా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రధాన రహదారుల్లో వేప చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పెద్దవంగలి, ఎం.తండా, ఓజీ తండా గ్రామాల్లో చేతికొచ్చిన మామిడికాయలు నేలరాలి దెబ్బతిన్నాయి. చెన్నవంగలిలో 50 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉంచిన బొప్పాయి కాయలు నేలవాలి దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. అకాల వర్షంతో సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచి పోయింది. తోడెండ్లపల్లె, చక్రవర్తులపల్లె, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో మొక్కొజొన్న, కొర్ర, బోర్ల కింద సాగు చేసిన వరి నేలకొరిగింది. చాగలమర్రిలో మునగ చెట్లు విరిగిపడి రైతులకు నష్టం వాటిల్లింది. అకాల వర్షం, పెను గాలుల వల్ల నష్టం సంబవించింది. అధికారులు స్పందించి నష్టం అంచన వేసి పరిహారం కోసం ప్రతిపాదనలు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### దెబ్బతిన్న బొప్పాయి తోటల పరిశీలన

మండలంలో పెనుగాలుల బీభత్సంతో దెబ్బతిన్న బొప్పాయి తోటలను శనివారం ఆళ్లగడ్డ డివిజన్ ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ శనివారం పరిశీలించారు. విరిగిపడ్డ బొప్పాయి చెట్లు, కాయలను పరిశీలించి నష్టం అంచన వేస్తున్నామని తెలిపారు. చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో 130 ఎకరా బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని అంచన వేశామని అన్నారు. 50 మందికి పైగా రైతులకు నష్టం జరిగిందన్నారు. నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట వీహెచ్ఏ శ్రావణి, రైతులు ఉన్నారు.

### 80 ఎకరాల్లో దెబ్బతిన్నబొప్పాయి తోటలు

**రుద్రవరం :** మండలంలోని ఆలమూరు గ్రామంలో 80 ఎకరాల్లో గాలికి బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు తెలిపారు. శనివారం ఆలమూరు గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి, అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలమూరు గ్రామంలో 168 ఎకరాల్లో బొప్పాయి తోటలు రైతులు సాగు చేశారు. 33 శాతం దెబ్బతిన్న తోటలను 80 ఎకరాలుగా గుర్తించామన్నారు. పంట చేతికందే సమయంలో గాలి వీచడంతో రైతులు నష్టపోయారు. నష్టపోయిన రైతులకు సబ్సిడీ కింద పండ్లమొక్కలను అందిస్తామన్నారు. రైతులు గాలులు వీచే సమయానికి పంట కోత చేసుకోవాలని సూచించారు. ఆకు తోటలు కూడా దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.


రుద్రవరంలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న అధికారులు

**డోన్ రూరల్:** గాలి, వాన బీభత్సవానికి అరటి తోటల చెట్లు కూలి పోయి రైతుకు రూ.15 లక్షల దాకా నష్టం వాటిల్లిందని డోన్ ఉద్యానశాఖ అధికారి కళ్యాణి తెలిపారు. శనివారం ప్యాపిలి మండలంలోని పీఆర్‌పల్లె గ్రామ పరిసరాల్లో గాలి, వాన బీభత్సవానికి కూలిపోయిన అరటి చెట్లను ఆమె పరిశీలించారు. పది ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు.


డోన్: గాలివానకు కూలిన అరటి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి కళ్యాణి

## 'వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలి'

**డోన్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** మైనార్టీ హక్కులను హరించే వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సభ్యులు చిన్న రెహిమాన్, అక్బర్ బాషా కోరారు. శనివారం సీపీఎం ఆధ్వ ర్యంలో మసీదుల వద్దకు వెళ్లి ముస్లింలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.

## 'సూర్యఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా

**చాగలమర్రి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** పీఎం సూర్యఘర్ పథకంతో విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ రమణయ్య తెలిపారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా సూర్యఘర్ పథకాన్ని అందిస్తుందన్నారు. విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో ఈ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## పండ్లతోటల సాగు లాభదాయకం

**చాగలమర్రి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో రైతులు పండ్ల తోటలు సాగు చేయడం వల్ల లాభదాయకంగా ఉంటుందని 'ఉపాధి' ఏపీవో ఖాసీం తెలిపారు. శనివారం ఉపాధి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని అన్నారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు మూడేళ్ల పాటు ఉపాధి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వందశాతం సబ్సిడీతో పండ్ల తోటలకు రాయితీ ఉంటుందని అన్నారు. 16 రకాల పండ్ల తోటలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా: మంత్రి

**బనగానపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచే పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటనలు చేపట్టారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణానికి నలువైపులా నాలుగు స్వాగత తోరణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో నాలుగు రోడ్ల కూడళ్ల అభివృద్ధికి ప్రభుత్వ ఆర్‌అండ్‌బీ ఆర్కిటెక్చర్ అధికారులతో చర్చించారు. పట్టణంలోని పలు జంక్షన్ రోడ్లను పరిశీలించారు. బనగానపల్లె పట్టణాన్ని ట్రాఫిక్ సమస్యనుంచి విముక్తి కలిగించేందుకు రహదారుల విస్తరణకు పక్కాగా ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి తెలిపారు. మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, అధికారులు, నాయకులు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

### విద్యార్థికి మంత్రి అభినందన

జేఈఈ మెయిన్స్‌లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా విద్యార్థికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం అభినందించారు. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి చెందిన వంగల అజయ్‌రెడ్డి ఈడబ్ల్యూఎస్ విభాగంలో ప్రథమ ర్యాంకు దక్కించుకోవడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పోటీలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లాకే గర్వకారణం అన్నారు. అలాగే ఏపీ నుంచి వంద పర్సంటైల్ స్కోర్ సాధించిన సాయి మనోజ్ఞ గుత్తికొండకు కూడా మంత్రి అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా రన్ ఫర్ జీసస్

**డోన్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** గుడ్ ఫ్రైడే, ఈస్టర్ ను పురస్కరించుకుని శనివారం డోన్ పాస్టర్స్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి నుంచి శ్రీరామ థియేటర్, పాతబస్టాండు, రైల్వేగేట్ల మీదుగా క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీలో క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ శామ్యూల్, పాస్టర్స్ రెవరెండ్ ఆనందరావు, అనిల్ కుమార్, ఉదయ్, నిరీక్షణ్, ప్రసాద్, డేవిడ్, తిమోతి, సంఘ పెద్దలు కరుణాకర్, రాజశేఖర్, శ్యాం, దేవదాస్, మైకేల్, అమృత, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



బేతంచెర్లలో పాస్టర్స్ నిర్వహిస్తున్న ర్యాలీ

**ప్యాపిలి:** పట్టణంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీయోనా ప్రార్థనమందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ పుర వీధుల గుండా సాగింది. పాస్టర్ సుందరం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో నుంచి క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** బేతంచెర్ల మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసన్న, కార్యదర్శి పాస్టర్ డీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. యేసుక్రీస్తు మరణ, పునరుత్థానం గురించి వివరిస్తూ పట్టణంలో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాస్టర్ సామేలు, పాస్టర్లు ఆనంద్, మల్లేష్‌బాబు, రాజశేఖర్, కుమార్, ప్రభుదాస్, మార్కు, క్రైస్తవులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో మనుగడకు ముప్పు

**శిరివెళ్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) :** ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప అన్నారు. శిరివెళ్లలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అశ్విన్ కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప కుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసుల శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, హౌసింగ్ ఏఈ అహ్మద్ బాషా పాల్గొన్నారు.

## విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**డోన్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా సూచించారు. శనివారం పట్టణం సమీపాన ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్, పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ అధికారుల పోస్టులను భర్తీ చేయాలి

**ప్యాపిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రంథాలయ అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా, మండల, ప్రభుత్వ కళాశాలల్లోని గ్రంథాలయాల్లో ఏళ్ల తరబడి లైబ్రేరియన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**ప్యాపిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో సైబర్ నేరాలపై ఆయన ప్రజలుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ శుభ్రత అందరి బాధ్యత

**ప్యాపిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** గ్రామ శుభ్రత అందరి బాధ్యతగా భావించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం అన్ని పంచాయతీలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు భారతి, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, శివకుమార్, ఫ్రాన్సీస్, క్రిష్ణారెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డివాములు దగ్ధం

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో శనివారం నాలుగు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రామలింగారెడ్డి, పుల్లారెడ్డి, సోముల రామలింగారెడ్డి, లక్ష్మిలింగారెడ్డిలకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిపోయాయి. ఆళ్లగడ్డ నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. గడ్డి వాములు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు.

**రుద్రవరం:** మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమయింది. దాంతో రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు లింగారెడ్డి శనివారం వాపోయాడు.

**ప్యాపిలి:** మండలంలోని గార్లదిన్నె గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధమైంది. రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు బాలుడు వాపోయాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

## రైతు సేవా కేంద్రంలో టీవీ చోరీ

**రుద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కోటకొండ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. శనివారం వీఏఏ రేవతి విధులకు హాజరయ్యారు. కేంద్రంలో టీవీ లేకపోవడంతో వ్యవసాయ అధికారి సుమతి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఏవో సుమతి పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు.

## పనిముట్లు పంపిణీ

**డోన్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం 18 రకాల కులవృత్తుల వారికి ఉచితంగా శిక్షణ ఇస్తూ, పనిముట్లను అందించడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పోస్టాఫీసులో పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు పనిముట్లను పంపిణీ చేశారు.

## తాగునీటి సరఫరాకు రామ్‌కో చేయూత

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం రామ్‌కో పరిశ్రమ తన వంతు చేయూతను అందిస్తోంది. ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా గ్రామాల కు తాగునీటి సరఫరాను ప్రారంభించారు. మండలంలోని కొలిమి గుండ్ల, మీర్జాపురం, కనకాద్రిపల్లె, చింతలాయపల్లె తదితర గ్రామాల్లో ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు రామ్‌కో ప్రతినిధులు వెల్లడించారు.

## అప్రమత్తంగా ఉండాలి

**డోన్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డోన్ అగ్నిమాపక శాఖ అధికారి ఎం.రంగస్వామి గౌడు అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు, నర్సులకు డాక్టర్లకు, ఆసుపత్రి వచ్చిన రోగులకు అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాక్టికల్స్ డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్య గౌడు, అగ్నిమాపక సిబ్బంది, ప్రభాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

**అగ్నిమాపక వారోత్సవాల్లో..**

**బనగాన పల్లె:** అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె ఫైర్‌స్టేషన్ అధికారి ఈశ్వర్ నాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రియదర్శిని ఉన్నత పాఠశాలలో ప్రదర్శనా పూర్వకంగా అవగాహన కల్పించారు. కరపత్రాలు పంచారు.

## మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** కొలిమిగుండ్లలో ఎమ్మార్పీస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. శనివారం స్థానిక దండోరా కార్యాలయం వద్ద ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 30ఏళ్ల ఎమ్మార్పీఎస్ పోరాటంతో ఇది సాధ్యమైందని సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు మాదిగ అన్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోవెలకుంట్ల ఎంఈవో వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం గుళ్లదుర్తిలో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వీధులు శుభ్రం చేశారు. మండలంలో గుళ్లదుర్తి, అమడాల, కలుగొట్ల, రేవనూరు, కోవెలకుంట్ల పట్టణంలోని మెయిన్ పాఠశాల, స్పెషల్ పాఠశాల, పేట, గాంధీ ఉర్దూ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

## వైభవంగా కలశస్థాపన మహోత్సవం

**చాగలమర్రి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని శెట్టివీడు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం వేదపండితులు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో కలశస్థాపన పూజ చేశారు. ఉభయదారులు నర్సయ్య, సుభద్రమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## పోషణ్ పక్షోత్సవాలపై అవగాహన

**చాగలమర్రి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** మండలంలో పోషణ్ పక్షోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఓబులేసు అన్నారు. శనివారం చాగలమర్రిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ రవికుమార్, ఎంఈవో అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ వర్కర్లు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**ఉయ్యాలవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి పర్వీన్ అన్నారు. శనివారం మండలంలోని 20మంది ఐదో తరగతి విద్యార్థులను స్థానిక ఉన్నత పాఠశాలలో 6వతరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 రఘురామిరెడ్డి, ఎంఈవో -2 ప్రతాప్‌రెడ్డి, పీఆర్‌ఏఈ వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికలను చదివించాలి

**ఉయ్యాలవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** బాలికలను బాగా చదివించి ఉన్నతస్థాయికి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారి షాహిదాపర్వీన్ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు, తహసీల్దారు శ్రీనివాసులు, అంగన్‌వాడీ సూపర్ వైజరు ప్రభాకరమ్మ, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి

**ఉయ్యాలవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పండ్లతోటల సాగుకు దరఖాస్తులు

**రుద్రవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :** మండలంలో పండ్లతోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కింద కుటుంబానికి ఐదేకరా ల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు అర్హులని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి రైతులు తమ గ్రామపంచాయతీ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయం, ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు సమర్పించవచ్చని సూచించారు.